క్లుప్తంగా

తాగునీటి బావిలో పైపుల పునరుద్ధరణ



సాక్షి ఎఫెక్ట్

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలోని చెరువు వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని తాగునీటి బావిలో లీకవుతున్న పైప్‌లైన్‌ను అధికారులు పునరుద్ధరించారు. మంగళవారం 'తాగునీరు కలుషితం' శీర్షికన పైపులైన్ల లీకులు, అపరిశుభ్ర పరిస్థితులపై 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. బావిలో లీకవుతున్న పైపులను పునరుద్ధరివచటంతో పాటు బావి చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. బావిపై కొద్ది రోజుల్లో రక్షణ మూత ఏర్పాటు చేస్తామని కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బావిని పరిశీలించి పలు సూచనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో బుధవారం 6 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ విజయవాడ రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాస్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలు, చందర్లపాడు, వీరులపాడు సెక్షన్ల పరిధిలోని గ్రామాల్లో 132 కె.వి లైన్ల మరమ్మతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి 11:45 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

మైలవరం: మైలవరంలో సివిల్ జడ్జి కోర్టుకు స్థలం కేటాయించాలి. 2010 ఆగస్టులో ఈ కోర్టు ఏర్పాటు చేశారు. దీన్ని తాత్కాలికంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం భవనంపై ఏర్పాటు చేశారు. గతంలో మైలవరం నుంచి కక్షిదారులు తిరువూరు, నూజివీడులోని కోర్టులకు హాజరుకావల్సివచ్చేది. మైలవరంలో కోర్టు ఏర్పాటు చేయడంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులు, సివిల్ కేసులు ఇక్కడే పరిష్కరిస్తుండటంతో కక్షిదారులకు డబ్బు, సమయం కూడా ఆదా అవుతోంది. సుమారు రెండు వేల కేసులు వరకు ఇక్కడ కోర్టులో విచారణలు జరుగుతున్నాయి. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సొంత భవన నిర్మాణానికి అప్పట్లో స్థలం కోసం మైలవరంలోని ఎస్సీ బాలికల వసతి గృహం పక్కనే ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్ స్థలం, ఎస్‌ఎస్‌పీ కార్యాలయం ప్రాంగణాన్ని జిల్లా జడ్జి రామచంద్రారెడ్డితో పాటు, జడ్జిలు చిరంజీవి, చంద్రశేఖర్ వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం కోర్టు కొనసాగుతున్న ప్రాంగణంలో మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఐకేపీ కార్యాలయంతో పాటు, ఎంపీపీ పాఠశాల కూడా కొనసాగుతుండటంతో కోర్టు కార్యకలాపాలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే అందులోనే జడ్జి నివాసానికి, జైలు ఏర్పాటుకు కూడా అనుకూలంగా ఉంటుందని న్యాయవాదులు చెబుతున్నారు. కోర్టు భవన నిర్మాణానికి ఆర్ అండ్ బీ అధికారులు స్థలం కేటాయింపునకు అంగీకరించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి ఉన్నతాధికారుల నుంచి అంచనాలు తీసుకుంటున్నారు. అయితే అడిషనల్ మున్సిఫ్ కోర్టు భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేస్తే రెండు భవనాలు ఏక కాలంలో నిర్మించవచ్చని, రెండు కోర్టుల నిర్వహణకు ఇబ్బంది ఉండదని న్యాయవాదులు చెబుతున్నారు.

22 నుంచి ఉచితంగా పుస్తకాల పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో సాధారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, ఆధ్యాత్మిక, సాంఘిక, భాష, ఇంజినీరింగ్, వైద్య విజ్ఞాన శాస్త్రాలతోపాటు కళలు, తెలుగు, ఆంగ్ల సాహిత్యం, చరిత్ర, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం తదితర విషయాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తత్వశాస్త్ర గ్రంథాలు 2,200, మత, ఆధ్యాత్మిక గ్రంథాలు 7,400, సాంఘిక శాస్త్రాలు 3,300, శాస్త్ర సాంకేతిక రంగానికి చెందిన 5,000, ఆంగ్ల-తెలుగు సాహిత్యానికి చెందిన 5,800, చరిత్ర గ్రంథాలు 1,800, ఇంకా 8,000 పుస్తకాలకు పైగా ఇంజినీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి వివిధ విద్యాసంస్థల స్టడీ మెటీరియల్ కూడా ఉన్నాయని చెప్పారు. ఆయా తేదీల్లో ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు బెంజిసర్కిల్ వద్ద ఉన్న సర్వోత్తమ గ్రంథాలయంలో పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. విషయ ప్రాధాన్యత ప్రకారం పుస్తకాల ప్రదర్శన చేస్తున్నామని తెలిపారు. ఈ పుస్తకాల పంపిణీలో ఎవరైనా తమకు ఇష్టమైన రెండు పుస్తకాలను ఎంపిక చేసుకుని తీసుకెళ్లవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం ప్రజలు నమ్మడం లేదు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను
- 31వ వార్డు శాంతినగర్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు'



పేటలోని శాంతినగర్‌లో మహిళలకు కరపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం ఎవరూ నమ్మడం లేదని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దీంతో ప్రజలంతా చాలా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం స్థానిక 14వ సచివాలయం పరిధిలోని 31వ వార్డు శాంతినగర్‌లో నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి, ప్రభుత్వంపై ప్రజలు ఎంత వరకు సంతృప్తితో ఉన్నారు? తదితర అంశాలపై సర్వే చేశారు. పలువురు స్థానికులు వీధి లైట్లు, డ్రెయిన్లు తదితర సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ఇంతటి అద్భుతమైన పాలన, సంక్షేమ పథకాలు జగనన్న ద్వారానే అందుతున్నాయని, గతంలో పేదలకు మేలు జరిగే ఒక్క పథకం కూడ ఎవరూ అమలు చేయలేదన్నారు. ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా లబ్ధి చేకూరుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. ఆయా ఇళ్ల యజమానుల అనుమతితో స్టిక్కర్లు అంటించారు.

ఇనాం భూముల సమస్యకు త్వరలో పరిష్కారం..

పట్టణంలో మూడు వేల ఎకరాలకు పైగా ఇనాం భూములు ఉన్నాయని, వీటిలో గృహాలు నిర్మించుకొని ఉన్న తామంతా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా, క్రయ విక్రయాలు చేసుకోవాలన్నా నిషేధిత జాబితాలో ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఈ సమస్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చామని, త్వరలో పరిష్కారం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, విజయవాడ కనకదుర్గ గుడి ట్రస్ట్ బోర్డు సభ్యుడు నంబూరి రవి, స్థానిక కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, సచివాలయ కన్వీనర్లు గింజుపల్లి కృష్ణ, దార సుజాత, పార్టీ యువజన విభాగం, మైనార్టీ, వాణిజ్య విభాగాల అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, షేక్ మొహిద్దీన్, చారుగుండ్ల కొండ, స్థానిక నాయకులు మన్నె అప్పారావు, కాశిం బాషా, సయ్యద్ ఆలీ, కమతం శ్రీను, గట్టి గుండె చంటీ, కుందవరపు వెంకటేశ్వర్లు, నూరుద్దీన్, నాగేశ్వరరావు, తదితర ముఖ్య నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ దేవమణి, మండల పార్టీ అధ్యక్షుడు రామారావు

వత్సవాయి: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, మండల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి వివరించారు. మంగళవారం చిట్టేల, భీమవరం, వత్సవాయి, మక్కపేట, మంగొల్లు, పెంట్యాలవారిగూడెం, కన్నెవీడు, ఇందుగపల్లి, కంభంపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు నాయకులు కలిసి ఇంటింటికీ తిరిగి గత టీడీపీ ప్రభుత్వం చేసిన పనులు ప్రస్తుతం వైఎస్సార్ సీపీ చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరును గమనించాలని కోరారు. మార్నెళ్ల పుల్లారెడ్డి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: మండలంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని గ్రామాల్లో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, గత టీడీపీ హయాంలో జరిగిన వివక్ష పాలనను ప్రజలకు వివరిస్తున్నారు. చిల్లకల్లులో ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గృహ యజమానుల అనుమతితో ఇళ్లకు, ఫోన్‌లకు స్టిక్కర్‌లు వేస్తున్నారు.

కంచికచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం కొనసాగింది. కంచికచర్ల పట్టణంలో పట్టణ కన్వీనర్ వేమా సురేష్ బాబు, మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావుల పర్యవేక్షణలో కార్యక్రమాలు కొనసాగాయి. ఆయా గ్రామాల్లో నాయకులు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు వివరించారు. ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమాలు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. ఆయా కార్యక్రమాల్లో పార్టీ పలు విభాగాల నాయకులు, గృహ సాథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- పొక్కునూరులో గడప గడపకు మన ప్రభుత్వం



వెలదికొత్తపాలెంలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గడప గడపకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం పొక్కునూరు గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా లబ్ధిదారులకు అందిన పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందించి, ఇళ్లు కూడా మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగా కులమత, రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి తమకు నచ్చిన వారికి తమ పార్టీ వారికి మాత్రమే పథకాలు అందించారని చెప్పారు. పక్షపాత పాలన సాగిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గతానికన్నా ఘన విజయాన్ని అందిస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కొమ్మినేని మహీంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కటుకూరి ముసలయ్య, పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, వేల్పుల స్వామి, రాయల జానకిరామయ్య, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్యాకెట్లను చూపుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగనన్న పాలనలో ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో భాగంగా పుట్టే ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. మంగళవారం శాంతినగర్‌లో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఉదయభాను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే పోషకాహారాన్ని, పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో పిల్లలకు అందజేసే పోషకాహారాన్ని నామమాత్రంగా అందించేవారని, కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని వేల కోట్ల ఖర్చుతో నాణ్యమైన పోషకాహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. గర్భిణులకు 4వ నెల నుంచి పుట్టిన బిడ్డను 6వ నెల వచ్చే వరకు పాలు, గుడ్లు, బాలామృతం అందజేస్తున్నారని, పిల్లలకు 3వ సంవత్సరం వరకు వచ్చే వరకు పోషకాహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. చిన్నారులకు జొన్నపిండి, రాగిపిండి, పల్లి చెక్క, ఎండు ఖర్జూరం, అటుకులు, బెల్లం తదితర పోషకాహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, నాయకులు తన్నీరు నాగేంద్ర, ఎస్‌ఏసీ సైదా, అంగన్‌వాడీ కార్యకర్త ఎండీ హసీనా, ఆయా బండారు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోలాటంపై పెరుగుతున్న ఆసక్తి

మక్కువ చూపిస్తున్న యువత



మహిళలు, చిన్నారుల కోలాటం (ఫైల్)

పెనుగంచిప్రోలు: కోలాటంపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. కోలాట నృత్యానికి పెనుగంచిప్రోలు, మక్కపేట, ముండ్లపాడు, తోటచర్ల, తదితర గ్రామాలకు చెందిన మహిళలు జీవం పోస్తున్నారు. కోలాట నృత్యంపై ఆసక్తి పెంచుకున్న పెనుగంచిప్రోలులోని చిన్నారులు ఒక బృందం, తోటచర్ల, ముండ్లపాడు, తదితర గ్రామాల్లో కూడా కోలాట బృందాలు ఏర్పడ్డాయి. గీతాలకు అనుగుణంగా రెండు కర్రలతో ప్రతి ఒక్కరూ లయబద్ధంగా నాట్యం చేసే ఆటే కోలాటం.

కోలాటంతో స్నేహపూర్వక వాతావరణం..

ఇటీవల కాలంలో గ్రామంలోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరిగే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ముందు కోలాట నృత్యాలు ఏర్పాటు చేస్తున్నారు. అటు ఆధ్యాత్మిక చింతన..ఇటు ఆరోగ్యం..మరోవైపు మానసిక ప్రశాంతతను ఈ ఆట ద్వారా పొందుతున్నారు. మాస్టర్ల వద్ద పాత కాలపు నృత్యాలతో పాటు ఆకట్టుకునే విధంగా గొడుగులు, దీపాలతో కోలాట నృత్యంలో శిక్షణ పొంది ప్రస్తుతం ప్రదర్శనలు ఇస్తున్నారు. అందరూ ఒకేచోట చేరి కోలాటం నేర్చు కోవటం వల్ల ఒకరికొకరికి మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. యువత కూడా ఈకోలాటం నృత్యంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఉన్నత విద్యావంతులు కూడా దీనిపై మక్కువ ప్రదర్శిస్తున్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



కంచికచర్ల: అప్రమత్తత తోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని లీడింగ్ ఫైర్ మాన్ కృష్ణమూర్తి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కంచికచర్ల లోని పలు పెట్రోలు బంకులు, గ్యాస్ కంపెనీలలో అగ్రి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ సిబ్బంది ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన



రామన్నపేట తాగునీటి పైప్ లైన్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నందిగామ: పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని రామన్నపేట రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో దెబ్బతిన్న తాగునీటి పైప్ లైన్లను తనిఖీ చేశారు. వాటికి చేయవలసిన మరమ్మత్తులకు సంబంధించిన అంశాలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు రహదారులలో విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆయా రహదారులలో ప్రజలు సహకరించాలన్నారు. ఏఈ ఫణి శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

10వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన

పట్టణ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని 10వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతోటే పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవచ్చన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రుమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి

వత్సవాయి : జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను మంగళవారం హౌసింగ్ డీఈ షేక్ ఖాదర్‌వలి పరిశీలించారు. మక్కపేట, చిట్టేల, లింగాల, వత్సవాయి గ్రామాల్లో జరుగుతున్న పనులను చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో ఇళ్లు నిర్మిస్తున్న ప్రతిఒక్కరికీ ప్రాధాన్యతాక్రమంలో ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఇసుక, ఇనుము, సిమెంట్‌ను లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. లబ్ధిదారులు ఇవి తీసుకోకుండా సొంతంగా నిర్మాణాలను చేసుకుంటే ప్రభుత్వం నుంచి మొత్తం నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. మక్కపేటలో లబ్ధిదారులు కొందరు తమకు కాలనీలో ప్రభుత్వం నుంచి బోర్లు వేయించాలని కోరగా దీనిపై స్పందించిన ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడతానని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ డి.చిదంబరేశ్వరరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గురుకిరణ్, మక్కపేట గ్రామపార్టీ అధ్యక్షులు కనగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి



డ్రోన్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న సర్పంచ్ కమల, అధికారులు

జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్

బండిపాలెం(జగ్గయ్యపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా చేస్తున్న భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే అధికారులు భూ సర్వేను క్షుణ్ణంగా పరిశీలించి చేయాలన్నారు. ముఖ్యంగా డ్రోన్ల సహాయంతో చేసే సర్వేను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి ఆ ప్రాంతంలోని రైతుల సహకారంతో చేయాలన్నారు. సర్వే బృందం ఉన్నతాధికారుల సూచనల మేరకు సర్వే చేయాలని తెలిపారు. అనంతతరం డ్రోన్లను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యారావు, తహసీల్దార్ నాగరాజు, సర్వేయర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు ప్రారంభం

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): జగనన్న భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీసర్వే మంగళవారం గ్రామంలో చేపట్టారు. రీ సర్వే నిర్వహణకు ఏర్పాటు చేసిన డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్కా కమల మాట్లాడుతూ భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన ఈసర్వే పనులను ఇతర రాష్ట్రాల వారు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యులు బారు సుధారాణి, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు ఎన్ ప్రవీణ్, సొసైటీ అధ్యక్షుడు వేమూరి శేషగిరిరావు, గ్రామ నాయకులు పోపూరి రామకోటేశ్వరరావు, పొన్నం శివాజీ, గ్రామ కార్యదర్శి సీతారామరెడ్డి, వీఆర్ఓ పి.శ్రీను పాల్గొన్నారు.

భూ రీ సర్వే పనుల పరిశీలన

వీరులపాడు: రైతులకు ఇబ్బందులు లేకుండా భూముల రీ సర్వే నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. మండలంలోని వీరులపాడు, దొడ్డదేవరపాడు, వీఅన్నవరం, పల్లంపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న 'జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ వివాదాలు పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. సర్వే సిబ్బంది నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు. పలువురు రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు



ఫాగింగ్ మిషన్ల పనితీరును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా ఫాగింగ్, స్ప్రేయింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించారు. ప్రత్యేక షెడ్యూలను అనుసరించి వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బందితో ఫాగింగ్, మురుగు కాలువల్లో స్ప్రేయింగ్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వార్డుల్లో ప్రతి నెల మొదటి, రెండో వారాల్లో ఫాగింగ్‌ను, ప్రతి నెల మూడు, నాలుగు వారాల్లో స్ప్రేయింగ్ చేయించాల్సిందిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలు, ఇతర పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు వారి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై, కాలువల్లో పడవేయరాదని తెలిపారు.

హాల్‌టికెట్ల కోసం విద్యార్థుల ఆందోళన



కాలేజీ యాజమాన్యంతో మాట్లాడుతున్న అధికారులు

నందిగామ: తమకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదని పట్టణంలోని జీడీఎంఎం కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం సాయంత్రం ఆందోళన చేశారు. కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులలో పలువురు ఫీజులు చెల్లించకపోవడంతో యాజమాన్యం హాల్ టికెట్లను నిలిపివేసింది. బుధవారం నుంచి పరీక్షలు ఉన్న నేపథ్యంలో ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, , తహసీల్దార్ నరసింహారావు, ఎస్‌హెచ్‌ఓ సతీష్ కళాశాల యాజమాన్యంతో చర్చలు జరిపారు. కళాశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులకు ప్రభుత్వం నుంచి నగదు జమైనప్పటికీ ఫీజులు చెల్లించలేదని ఇలా అయితే కళాశాల ఎలా నడపాలని అధికారులకు కళాశాల యాజమాన్యం తెలియజేసింది. ఈ నేపథ్యంలో అధికారులు కళాశాల యాజమాన్యం, విద్యార్థులతో చర్చలు జరిపారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

120 మంది విద్యార్థుల రక్తదానం

తిరువూరు: స్థానిక శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నూజివీడు ఏరియా ఆస్పత్రి సహకారంతో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఏర్పాటు చేసిన శిబిరాన్ని కళాశాల కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రక్తదాన ఆవశ్యకతను ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, అధ్యాపకులు వివరించారు. 120 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కాళీ కృష్ణ తెలిపారు.